క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

జమ్మలమడుగు : మైలవరం మండలం వద్దిరాల గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం వద్దిరాల మెయిన్‌రోడ్డులో ఉన్న చర్చిలో ఫాదర్ కుమార్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

ఏసుక్రీస్తు లోక రక్షకుడు

కమలాపురం : ఏసుక్రీస్తు లోక రక్షకుడు అని నిస్సీ ప్రాఫెటిక్ మినిస్ట్రీస్ ఫౌండర్ బ్రదర్ సునీల్ దత్ తెలిపారు. బుధవారం స్థానిక నిస్సీ మినిస్ట్రీస్ ప్రాంగణంలో ఆహా క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. భక్త జనుల మధ్య కేక్ కట్ చేసి క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్లు అలరించాయి.

సుస్థిర అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కృష్ణమూర్తి గ్రామ పంచాయతీలలో అభివృద్ధి ప్రణాళికతోపాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పాత్రలను వివరించారు. ప్రజలకు మౌలిక అవసరాలు, గ్రామాలలో ప్రజలకు ఉపాధి అవకాశాలు, సామాజిక దురాచారాలు తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం మంజునాథ్, పీహెచ్‌సీ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి




మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరి

పులివెందుల రూరల్ : శనగ పంటకు ఆశించిన వేరుకుళ్లు తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఊటుకూరు పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరి తెలిపారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్క రైతు తమ పొలాల్లో మట్టిని పరీక్ష చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీడీఏ రమణారెడ్డి, ఏఓలు, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఆదాపై అవగాహన సదస్సు

వల్లూరు(చెన్నూరు) : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం 2:30 గంటలకు చెన్నూరు మండల పరిధిలోని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యుత్ ఆదాపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ మండల ఏఈ రామలింగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కరెంటును ఆదా చేయండి, భావి తరాలకు భరోసా నివ్వండి అనే అంశంపై విద్యార్థులకు, రైతులకు, ఇతర విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శునకాల స్వైర విహారం



ఎర్రగుంట్ల వీధులలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధులలో గుంపులు గుంపులుగా తిరుగుతుండటంతో మున్సిపల్ పరిధిలోని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నామని వారు అంటున్నారు. కొన్ని వీధులలో అయితే ఏకంగా కుక్కలు స్కూటరిస్టులను వెంటాడుతున్నాయని వాపోతున్నారు. కొన్ని చోట్ల కుక్కలు దాడి చేయడంతో ఆసుపత్రిలు చుట్టు తిరుగుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలను లేకుండా చేయాలని వారు కోరారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

వల్లూరు (చెన్నూరు) : సొంత ఇల్లు లేని నిరుపేదలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 2లో పక్కా గృహాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని గృహ నిర్మాణ శాఖ ఏఈ మినీల్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవసరమైన స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు లేదా తహసీల్దార్ ద్వారా పొందిన అనుబంధ పత్రాలు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రం, భార్యాభర్తల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఆధార్‌కు లింక్ అయినటువంటి మొబైల్ నెంబర్, తదితర పత్రాలతో హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా జలసంరక్షణ పనులు

జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంతోపాటు వాటిని సంరక్షించుకుంటే రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి నుంచి గట్టెక్కవచ్చునని భావిస్తోంది. ఈ మేరకు వచ్చే ఏడాది నుంచి ఉపాధి హామీలో జల సంరక్షణ పనులు విరివిగా చేపట్టాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రజలకు అవగాహన కల్పించడానికి వివిధ రకాల కార్యక్రమాలను రూపకల్పన చేసింది. దీనిపై క్షేత్ర సహాయకులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు.

- పనుల గుర్తింపులో ఉపాధి హామీ అధికారులు
- పనుల నిర్వహణపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ



ఉపాధి హామీ పనుల కింద చేపట్టిన ఇంకుడు గుంత



ఉపాధి హామీ పనులలో కూలీలు

సింహాద్రిపురం : ఉపాధి హామీ పథకం కింద జల సంరక్షణలో చేసే పనుల్లో ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వల గుంతల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. సింగిల్ ఫేజ్ మోటార్ల చేతి పంపుల వద్ద, ఇళ్లలో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపడతారు. ఇంటి పైభాగంలో కురిసిన వర్షపు నీటిని భూమిలోకి వెళ్లేలా (రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్) నిర్మాణాలు, ఖాళీ స్థలాలు, పంట పొలాల చుట్టూ కందకాల ఏర్పాటు, అనువైన చోట చిన్నపాటి కుంటల నిర్మాణాలు చేపట్టనున్నారు. సింహాద్రిపురం మండలంలో 6349 మొత్తం జాబ్ కార్డులు ఉండగా.. అందులో 4730 యాక్టివ్ జాబ్ కార్డులు. 11396 మంది కూలీలుగా నమోదయ్యారు. ప్రస్తుతం 7941 మంది పనిచేస్తున్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించినపనులను ఆ ఏడాదిలోపు పూర్తి చేయాలని, మరుసటి ఏడాది ఉపాధి హామీ కింద వాటిని చేయరాదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిబంధన విధించింది. ఈ నేపథ్యంలో గ్రామసభలో చేసే తీర్మానాలతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో పనులు ప్రారంభించడానికి గ్రామీణాభివృద్ధి సిబ్బంది ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో..

కేంద్రం ప్రభుత్వ ఆదేశాలతో 2025–26లో ఉపాధి హామీలో చేపట్టే జల సంరక్షణ పనులను క్షేత్రస్థాయిలో గుర్తించేందుకు శాఖ అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. డిసెంబర్ నాటికి పనులు గుర్తింపు పూర్తి చేసి వాటిని ప్రారంభించడానికి అనువుగా గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇంకుడు గుంతల పరంగా..

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి చేపట్టాలనుకునేవారు ఇక నుంచి తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మించుకోవాలన్న నిబంధన అమల్లో ఉంది. కానీ క్షేత్ర స్థాయిలో దీన్ని ఎవరూ పాటించడంలేదనేది స్పష్టమవుతోంది. పలువురు లక్షలాది రూపాయలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కానీ వేలాది రూపాయలు ఖర్చయ్యే ఇంకుడు గుంతల విషయంలో మాత్రం శ్రద్ధ వహించడంలేదు. దీంతో నీటి సంరక్షణకు అడుగులు ముందుకు పడటం లేదు. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టడానికి ఇంకుడు గుంతలు నిర్మిస్తేనే ఇళ్ల నిర్మాణ అనుమతులు ఇచ్చే విధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించి వాటిని కచ్చితంగా అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది.



ఇంకుడు గుంతలకు కొలతలు నిర్వహిస్తున్న ఉపాధి హామీ అధికారులు

జలసంరక్షణ పనులపై సిబ్బందికి శిక్షణ



గ్రామాల్లో జలసంరక్షణకు చేపట్టాల్సిన పనులపై ఉపాధి క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో వారు పనులను గుర్తించి వాటిని సకాలంలో పూర్తి చేసేలా శిక్షణ ఇస్తాం. ముఖ్యంగా గ్రామంలో జలసంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలలో భాగంగా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తవ్వకం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, ఉపాధి హామీ పనుల ఇసీ, సింహాద్రిపురం

నేటి నుంచి నీటి సరఫరా నిలిపివేత

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురం, శ్రీనివాసహాలు వెనుక ప్రాంతం, రాజారెడ్డి కాలనీ, రాజశేఖరరెడ్డి కాలనీలకు ఈనెల 19వ తేదీన గురువారం నుంచి 21వ తేదీ శనివారం వరకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆయా తేదీలలో నక్కలపల్లె ట్యాంక్ వద్ద నీటి సరఫరా చేసే పైపులైన్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అత్యవసర నీటి సరఫరా కొరకు 9398918446 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదిస్తే పురపాలక సంఘ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించి నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని కోరారు.

మా భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అహోబిలాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఉదయభాస్కర్‌రెడ్డి తహసీల్దార్ నజీర్‌అహ్మద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న 459/1లో 19 సెంట్లు, 459/2లో 62సెంట్ల భూమిని రామాంజనేయరెడ్డి, శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, ఆలీ బాషాలు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారన్నారు. ఈ భూమి మా తండ్రి తాళ్లపల్లె గంగిరెడ్డి పిత్రార్జితమన్నారు. నా పేరు మీద ఉన్న భూమిని వారు దౌర్జన్యంగా ప్లాట్లు వేసుకున్నారని, నాపై దయవుంచి నా భూమిని నాకు ఇప్పించాలన్నారు.

హైస్కూల్ ప్లస్ వ్యవస్థను రద్దు చేయవద్దు



యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసులు

వేంపల్లె : హైస్కూల్ ప్లస్ వ్యవస్థను రద్దు చేస్తే పేద గ్రామీణ బడుగు, బలహీన వర్గాల బాలికలు డ్రాపౌవుట్స్‌గా మారి విద్యకు దూరమవుతారని ఆంధ్రప్రదేశ్ పీజీటీ అసోసియేషన్ జిల్లా నాయకులు చెరుకూరు శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం హైస్కూలు ప్లస్ వ్యవస్థను రద్దు చేసే ఆలోచనను మానుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్‌బాబుకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022 సంవత్సరంలో జీవో నెంబర్ 124 ప్రకారం రాష్ట్రంలో 292 హైస్కూల్‌లలో హైస్కూల్ ప్లేస్‌లను ఏర్పాటు చేసి 1752 మంది ఉపాధ్యాయులను నియమించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ వ్యవస్థను రద్దు చేయాలని ఆలోచనలో ఉందన్నారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద బడుగు బలహీన బాలికల ఇళ్లకు వెళ్లి హైస్కూల్ ప్లస్ ఉచిత బాలికల ఇంటర్ కాలేజీలను గురించి వివరించి వారిని ఇంటర్లో చేరేందుకు కృషి చేశామన్నారు. స్థానికంగా ఎటువంటి ఫీజులు లేకుండా హైస్కూల్ ప్లస్‌లో బాలికలు చేరి ఎంతో ప్రయోజనం పొందారన్నారు. పేదరికం కారణంగా ఇంటర్మీడియట్‌కు దూరమయ్యే బాలికలకు హైస్కూల్ ప్లస్ వ్యవస్థ ఒక గొప్ప వరం లాంటిదన్నారు. పేద బాలికలకు ఉచితంగా ఇంటర్ విద్యను కొనసాగించే అవకాశం కలిఁపించాలని కోరారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ పేరును మార్చి జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలగా మార్పు చేస్తే బాగుంటుందన్నారు. హైస్కూల్ ప్లస్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న పీజీటీలకు జూనియర్ లెక్చరర్లుగా నామకరణం చేసి క్రమబద్ధీకరించాలని కోరారు. అయితే హైస్కూల్ ప్లస్‌కు ప్రిన్సిపాల్ లేకపోవడంవలన హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు అదనపు పనిభారం కావడం, సైన్సు ల్యాబ్ వసతి లేకపోవడం, తరగతి గదులు కొరత తదితర కారణాలు వల్ల బాలికల రోల్, పాస్ పర్సెంటేజ్ పెరగలేదన్నారు. కావున ఈ విషయాన్ని రాష్ట్ర యూటీఎఫ్ నాయకులకు తెలియజేసి పీజీటీ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పీజీటీ జిల్లా కన్వీనర్ ఆవుల వెంకట్, ఉపాధ్యాయులు సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణవేణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రమౌళి

వీరపునాయునిపల్లె : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎల్ఎస్‌డీజీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై జరిగిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మహిళల్లో స్నేహభావం పెంచేందుకు తరచూ మహిళా గ్రామ సభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, ట్రైనర్ నాగభూషణ్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాచిరెడ్డిపల్లెలో తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సు

పులివెందుల టౌన్ : ప్రజల, రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల భూ సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో వాటిని గుర్తించి పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్‌అహ్మద్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని తన నివాసంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

వల్లూరులో..

వల్లూరు : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ శ్రీవాణి తెలిపారు. మండల పరిధిలోని చిన్నపుత్త రెవెన్యూ గ్రామానికి సంబంధించి మాచిరెడ్డిపల్లెలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

బురదమయంగా రహదారి

పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డు సమీపంలో ఉన్న వెలమవారిపల్లెకు వెళ్లే రహదారి బురదమయంగా మారి అధ్వానంగా తయారైంది. దీంతో గ్రామానికి వెళ్లే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి రోడ్డంతా బురదమయమై గుంతలు ఏర్పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లే రోడ్డు మొదట్లోనే ఇలా ఉండటంతో గ్రామానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మారిన వెలమవారిపల్లెకు వెళ్లే రహదారి

గండి అంజన్నకు పూల సరఫరా కోసం టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి అలంకరణ కోసం ఏడాది కాలంపాటు పూలు సరఫరా చేసేందుకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక గండి క్షేత్ర ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంజన్న స్వామివారికి పూలు సరఫరా చేయుటకు ఆసక్తి గలవారు రూ.2 వేలు చెల్లించి ఈ నెల 20వ తేదీ సాయంత్రం లోపు టెండర్ షెడ్యూలు తీసుకుని అందులో తగిన రేట్లు కోట్ చేయాలన్నారు. వాటిని 21వ తేదీ కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో షీల్డ్ కవర్లను వేయాలన్నారు. ఇందుకోసం రూ.25 వేలు డిపాజిట్ చేయాలన్నారు. ఈనెల 21న తమ కార్యాలయంలో టెండర్లు నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు ఆలయ ప్రాంగణంలోని కార్యనిర్వహణాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

డీకేటి భూములు ఫ్రీహోల్డ్ చేయండి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి గ్రామ సచివాలయంలో భూముల సమస్యలపై బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి అడంగల్ కరెక్షన్, మిగులు భూములు తదితర సమస్యలపైన 20 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కొందరు రైతులు 20 సంవత్సరాలు పైగా అనుభవం కలిగిన తమ డీకేటీ భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని రెవెన్యూ అధికారులను అభ్యర్థించారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, తహసీల్దార్ నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, దేవాదాయ శాఖ తరపున ఈవో రవిశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పాల్గొన్నారు. గురువారం ఇప్పపెంట గ్రామ భూ సమస్యల పరిష్కారం కొరకు ఇప్పపెంట సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు.

నేడు, రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు పోరుమామిళ్లలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అభి గ్రీన్ టెక్నాలజీ, యంగ్ ఇండియాలో వివిధ హోదాల్లో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా అగ్రికల్చర్, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 7 వేల నుంచి రూ. 21 వేల వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ధృవపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు.

- కమలాపురంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. అల్ డిక్సన్, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలలో టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివి 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 12వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు ధృవపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు.
- మైదుకూరులో శుక్రవారం ఉదయం 10 గంటలకు వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా, యంగ్ ఇండియా, నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీలో పనిచేసేందుకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ మెకానికల్ చదివి 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ. 12వేల నుంచి రూ. 18 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

హైందవ శంఖారావానికి ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి ఆహ్వాన పత్రం అందిస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

కమలాపురం : జనవరి 5వ తేదీన విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు హాజరు కావాలని కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉన్న జిల్లా అధ్యక్షుడిని కమలాపురం మండల విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ఆహ్వాన పత్రం అందించి బహిరంగ సభకు హాజరు కావాలని కోరారు. తప్పకుండా వస్తానని రవీంద్రనాథ్‌రెడ్డి వారికి సూచించారు.

మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

పులివెందుల రూరల్ : మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పులివెందుల ప్లేవుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్లేవుడ్ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

ఇటీవల పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న ఓ మార్వాడి షాపు యజమాని వస్తువులు కొనడానికి వెళ్లిన ఓ మహిళపై దాడి చేయడం జరిగిందని.. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఎక్కడో ఇతర రాష్ట్రం నుంచి వ్యాపారం కోసం పులివెందులకు వచ్చి మార్వాడీలు మహిళలపై దౌర్జన్యాలు ఎక్కువ అయ్యాయన్నారు. ప్రజలకు నాసిరకమైన వస్తువులు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. గతంలో కూడా వస్తువులు కొనుగోలు చేయడానికి వచ్చిన వారిపై దురుసుగా ప్రవరించారన్నారు. ఇలాంటి వారిపైన పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే అసోసియేషన్ తరపున వారి దుకాణాలపైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

వరిలో కాలిబాటలు తప్పనిసరి



వరి పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : వరి పంటలో కాలిబాటలు తప్పనిసరిగా తీయాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం గంగవరం, విభరాపురం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె వరి పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. కాలిబాటల ద్వారా వెలతురు బాగా అందుతుందని, సుడి దోమను కూడా నివారించవచ్చన్నారు. నారు కొనలు తుంచి నాటడం వలన కాండం తొలిచే పురుగును నివారించవచ్చన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఇ-పంటను నమోదు చేసుకోవాలన్నారు. వరి పంటకు బీమాను డిసెంబర్ చివరిలోపు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ నమోదు పరిశీలన



ఇ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీడీఏ రమణారెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని బలపనూరు గ్రామంలో బుధవారం జరుగుతున్న ఇ-క్రాప్ నమోదును బుధవారం వ్యవసాయ శాఖ డీడీ రమణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏఓ శివమోహన్‌రెడ్డిని ఇ-క్రాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీడీఏ రమణారెడ్డి మాట్లాడుతూ రైతు ఏ పంట వేసి ఉంటే ఆ పంటకే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని, తప్పనిసరిగా వీఏఏలు ఇచ్చే పంట నమోదు పత్రాన్ని జత చేసి ప్రీమియం చెల్లించాలని, లేదంటే ప్రీమియం వర్తించదన్నారు. అలాగే ప్రీమియం ఇన్సూరెన్స్ చెల్లింపు గడువు ఈనెల 30వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏవో నాగభూషణ్‌రెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుక్కలు రాకుండా ప్రత్యేక చర్యలు

పులివెందుల రూరల్ : మండల పరిధి నల్లపురెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుక్కల మధ్య విద్యార్థులకు భోజనం పెడుతున్నారని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఇటీవల సాక్షి దిన పత్రికలో 'మధ్యాహ్న భోజనం వద్ద కుక్కల బెడద' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకుని కుక్కలు రాకుండా విద్యార్థులకు భోజనం అందించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



కుక్కలు రాకుండా చర్యలు తీసుకున్న ఉపాధ్యాయులు